
## ఇష్టారాజ్యంగా దరఖాస్తు పత్రాలు

### అకాల వర్షానికి తడిసిన పేపర్లు



తడిసిన అప్లికేషన్ ఫైళ్లు

జగిత్యాల రూరల్, మే 17: అకాల వర్షానికి తోడు సిబ్బంది నిర్లక్ష్యంతో అర్జీదారులు పెట్టుకున్న అప్లికేషన్ పత్రాలు తడిసిముద్దయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా రూరల్ మండల తహసీల్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది కిటికీ పక్కనే పలువురు అర్జీదారుల అప్లికేషన్స్ పత్రాలను పెట్టి వెళ్లిపోయారు. రాత్రివేళలో కురిసిన అకాల వర్షానికి అప్లికేషన్ పత్రాలన్నీ తడిచిముద్దయ్యాయి. ఎంతో జాగ్రత్తగా భద్రపర్చాల్సిన ఫైళ్లు గదిలో కిటికీ పక్కనే పడేసి వెళ్లిపోవడంతో తడిసిపోయాయి. తడిసిన ఫైళ్లు పక్కనే ఇన్వెటర్ బ్యాటరీలు ఉన్నాయి. బ్యాటరీలు తడిసి అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యతా వహిస్తారంటూ సిబ్బందిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ సిబ్బంది మాత్రం ఇన్వెటర్లు పని చేయడం లేదని, ఆ అప్లికెషన్స్ డేట్ అయిపోయాయని, అందుకే పక్కన పెట్టినట్లు చెప్పడం గమనార్హం.

## ధాన్యం కమీషన్‌పై సెర్ప్ డైరెక్టర్ ఆరా

- సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- 'నమస్తే' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

కరీంనగర్ కలెక్టరేట్, మే 17: జిల్లాలో గత కొద్ది సీజన్లుగా పెండింగ్‌లో ఉన్న ధాన్యం కమీషన్ చెల్లింపులపై సెర్ప్(నాన్‌ఫామ్) డైరెక్టర్ జాన్సన్ ఆరాతీశారు. కరీంనగర్ జిల్లాలో ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్న మహిళా సంఘాల సభ్యులకు చెల్లించాల్సిన కమీషన్ పూర్తిగా చెల్లించకుండా తాత్సారం చేయడం, సెర్ప్ నుంచి విడుదలైన వెంటనే వీవోల ఖాతాల్లో జమ చేయకుండా బ్యాంకుల్లో డిపాజిట్ చేయడంపై శనివారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అటకెక్కిన ధాన్యం కమీషన్?' శీర్షిక పేరిట కథనం ప్రచురించగా సెర్ప్ వర్గాల్లో సంచలనం రేపింది. దీనిపై స్పందించిన డైరెక్టర్ జాన్సన్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలోని మార్కెటింగ్ సెక్షన్ సిబ్బందిని ఎన్ని సీజన్ల కమీషన్ పెండింగ్‌లో ఉన్నది? చెల్లించాల్సిన మొత్తం సొమ్ము ఎంత? చెల్లించిన మొత్తం ఎంత? పౌరసరఫరాల శాఖ నుంచి సెర్ప్‌కు ఎప్పుడు కమీషన్ విడుదలైంది. వీవోఏల ఖాతాల్లో ఎప్పుడు జమచేశారు. ఇంకెంత మొత్తం మిగిలి ఉన్నది అనే అంశాలపై సమగ్ర నివేదిక పంపాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. నివేదిక అందిన అనంతరం పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు.



## నేడు సిరిసిల్లకు కేటీఆర్

- పలు శుభకార్యాలకు హాజరుకానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

రాజన్న సిరిసిల్ల, మే 17 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో ఆదివారం పలు శుభకార్యాలకు హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 11గంటలకు గంభీరావుపేట మండల కేంద్రానికి చేరుకుంటారు. కోళ్లమద్ది గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో విగ్ర హ ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరవుతారు. 11.30గంటలకు దమ్మన్నపేటలోని పార్టీ కార్యకర్త ఆరుట్ల రాజిరెడ్డి కూతురు వివాహానికి, మధ్యాహ్నం 12గంటలకు జగదాంబ తండాలో భూక్యా శంకర్ కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్లారెడ్డిపేటకు చేరుకుంటారు. మండల కేంద్రంలో విలేకరి గుర్రాల చంద్రమోహన్‌రెడ్డి పిల్లల వస్త్రాలంకరణకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 1.30గంటలకు సాయిమణికంటగార్డెన్‌లో మల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ కముటం రాజేందర్ కుమారుడి, మధ్యాహ్నం 2గంటలకు రాచర్లబొప్పాపూర్‌లో ఈదులకంటి శ్రీనివాస్‌రెడ్డి కూతురు, 2.30గంటలకు వైశ్య సంఘం నాయకుడు అల్లాడి ప్రేమ్‌కుమార్ కూతురు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు సిరిసిల్లకు చేరుకుంటారు. తెలంగాణ భవన్‌లో సమ్మెట పరశురాములు కూతురు వివాహనికి హాజరై, హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.



మాట్లాడుతున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

## నగరంలో యథేచ్ఛగా పార్కుల కబ్జా

- ఎల్‌ఆర్‌ఎస్‌లో అక్రమ వసూళ్లు సిగ్గుచేటు
- మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్

కలెక్టరేట్, మే 17: నగరంలోని పలు పార్కులు కబ్జాకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకుండా చోద్యం చూస్తోందని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బల్దియా అనుసరిస్తున్న తీరుపై నిప్పులు చెరిగారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో నగరపాలక సంస్థలో 42పార్కులుండగా, ప్రస్తుతానికి వాటి సంఖ్య 35కు చేరిందన్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు నగరంలో అనేకచోట్ల పార్కుల స్థలాలు ఆక్రమిస్తూ, వాటిని క్లబ్ స్థలాలుగా మార్చుతున్నారని మండిపడ్డారు. ఒక్కో క్లబ్‌కు రూ.3కోట్ల దాకా వసూళ్లు చేసినట్లు ఆరోపించారు. క్రీడా స్ఫూర్తి పెంపొందించే క్రమంలో పార్కులను మున్సిపల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తే వాటికి తాళాలు వేయడం వెనుక ఆంతర్యమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో గతంలో దోచుకున్న డబ్బు ప్రజలకు తిరిగి ఇవ్వాలని, అవినీతికి పాల్పడిన కమిషనర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. గ్రామ పంచాయితీలో భూములు ఎఫ్‌టీఎల్ జాబితా లేకున్నా ఉన్నట్లు చెబుతున్నారని, జాబితా రూపొందించడంలో అధికారులు వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. గ్రామ పంచాయితీలో అనేక భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూములు, నగర పార్కుల్లో వేలకోట్ల కుంభకోణం జరుగుతుందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా పట్టించుకోకుండా మార్కెట్ స్థలాలను కబ్జా చేస్తున్నారని, ఐలాండ్ల అభివృద్ధి పేరుతో అధికారులు అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట ఆ డివిజన్‌లో వచ్చిన డబ్బుల్లో 30 శాతం డివిజన్ అభివృద్ధికి కేటాయించాల్సి ఉండగా, ఆ మొత్తాన్ని పార్కులు, క్లబ్బులకు మళ్లించడం వెనుక మతలబేంటో స్పష్టమవుతుందన్నారు. మున్సిపాల్టీలో ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో గతంలో రూపాయికే నల్లా కనెక్షన్ ప్రారంభించగా, ప్రస్తుతం రూ.4వేల నుంచి రూ.5వేల దాకా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రూపాయికే అంతిమయాత్ర పథకాన్ని అమలు చేయగా, ప్రస్తుతం రూ.వెయ్యికి పెంచారని దుయ్యబట్టారు. విలీన గ్రామాల్లోని శిఖం, కుంట, తదితర ప్రాంతాల్లోని ఎఫ్‌టీఎల్ భూముల జాబితా ఇప్పటివరకు సిద్ధం కాకపోవడం శోచనీయమన్నారు. పార్కుల స్థలాలకు ఎల్ఆర్‌ఎస్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## అ'విశ్రాంత' వెత

- విరమణ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఏవి?
- ఏడాదిగా ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- దుర్భరంగా మారిన రిటైర్డ్ ఎంప్లాయీస్ జీవితం
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- వెంటనే విడుదల చేయాలంటూ వేడుకోలు



విశ్రాంత ఉద్యోగుల కల చెదిరింది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా దశాబ్దాలపాటు సేవలందించి విరమణ పొందితే చివరికి కన్నీరే మిగులుతున్నది. విరమణ తర్వాత వచ్చే బెనిఫిట్స్ కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వస్తున్నది. గత ప్రభుత్వంలో రిటైర్మెంట్ కాగానే వారం, పదిరోజుల్లో ప్రయోజనాలు అందగా, ప్రస్తుతం ఏడాది గడుస్తున్నా ఇవ్వకుండా సర్కారు ముప్పతిప్పలు పెడుతున్నది. జిల్లాలో గడిచిన ఏడాది కాలంలో 140 మంది రిటైర్డ్ కాగా, అందరికీ పెండింగ్‌లోనే పెట్టగా, తమ ఆర్థిక అవసరాలు తీర్చలేక నరకం చూస్తున్నారు. దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ప్రయోజనాలు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కరీంనగర్ కలెక్టరేట్, మే 17 : జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం అరిగోస పడుతున్నారు. రిటైర్మెంట్ తీసుకొని ఆరు నెలలు దాటినా ప్రయోజనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి రాగానే విశ్రాంత ఉద్యోగులకు అండగా నిలుస్తామని, సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించింది. అయితే, ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర కావస్తున్నా వారి సమస్యలకు మాత్రం ఇప్పటివరకు పరిష్కార మార్గం చూపలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్రం ప్రతి ఆరునెలలకోసారి కరువు భత్యం (డీఏ) పెంచుతుంది. అయితే, కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఏలతోపాటు పీఆర్సీ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్, గద్దెనెక్కిన తర్వాత మొండి చేయి చూపుతున్నది. ప్రస్తుతం ఆరు డీఏలకు సంబంధించి బకాయిలు పెండింగ్‌లో ఉండగా, ఇటీవలే ఒక డీఏ మాత్రం చెల్లించింది. మిగతావి ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

### బెనిఫిట్స్ కోసం ప్రదక్షిణలు

సాధారణంగా రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు పనిచేసిన కాలంలో జమ చేసుకున్న ప్రావిడెంట్ ఫండ్‌తోపాటు గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలన్నీ కలిపి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందజేస్తున్నది. సహజంగానే ఉద్యోగి రిటైర్మెంట్ గడువు సమీపిస్తున్న తరుణంలో అతనికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించి, వాటి ఆధారంగా విరమణ తర్వాత వారం పది రోజులు, గరిష్టంగా నెల రోజుల వ్యవధిలో అన్ని ప్రయోజనాలను అందజేస్తూ వచ్చేది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు ఏడాది గడుస్తున్నా బెనిఫిట్స్‌ను మంజూరు చేయడం లేదు. జిల్లాలో ఏడాది కాలంగా 140 మంది విరమణ పొందగా, వారికి కేవలం పెన్షన్ మాత్రమే విడుదల చేస్తూ, మిగతా ప్రయోజనాలన్నీ పెండింగ్‌లోనే పెట్టినట్లు విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి విరమణ ప్రయోజనాలు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అవస్థలు పడుతున్నారు. రిటైర్డ్ అయ్యాక వచ్చే మొత్తాన్ని లెక్కేసుకొని పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణం, తదితర అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించుకున్న వారు, సొమ్ము చేతికి అందుతుందనే భరోసాతో అప్పులు చేసి కార్యాలను గట్టెక్కించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏడాదికావస్తున్నా ఇంకా విరమణ సొమ్ము చేతికి అందకపోవడంతో సతమతమవుతున్నారు. బెనిఫిట్స్ కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదని, అత్యవసర పరిస్థితుల్లో చేబదులు కూడా లభించక కడు దుర్భర జీవితం అనుభవిస్తున్నట్లు వాపోతున్నారు. బాధలు ఎవరికి చెప్పుకోలేక, అవసరానికి డబ్బులు ఎవరినీ అడుగలేక మానసికంగా లోలోన కుంగిపోతున్నారని విశ్రాంత ఉద్యోగుల సంఘం నేత పెండ్యాల కేశవరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్‌కార్డులపై రూ.5 లక్షల ఉచిత వైద్య సదుపాయమైనా కల్పించినా, కొంతలో కొంత ఇబ్బందులు అధిగమించే వారనే అభిప్రాయం ఆయన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు.

## చితకబాది.. నగదు లాక్కెళ్లి..

- వేములవాడ లాడ్జిలో అవమానీయ ఘటన
- మహిళా భక్తురాలిపై దుండుగల అసభ్య ప్రవర్తన
- పోలీసులమంటూ బెదిరింపులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- నాలుగు రోజుల క్రితమే ఠాణాలో ఫిర్యాదు

వేములవాడ, మే 17: వేములవాడలోని ఓ లాడ్జిలో అవమానీయ ఘటన చోటుచేసుకోగా, ఆలస్యంగా వెలుగుచూసింది. రాజన్న దర్శనానికి వచ్చి అద్దె గదులో ఉన్న భక్తులతో నలుగురు దుండుగులు అసభ్యంగా ప్రవర్తించారు. భక్తులను చితకబాది.. వారి నగదును లాక్కెళ్లారు. పోలీసులమంటూ బెదిరింపులకు గురిచేయగా, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు ఈ నెల 2న వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ సమీపంలో ఉన్న గణేశ్ లాడ్జిలో అద్దెకు దిగారు. వారువచ్చిన దాదాపు గంటన్నర తర్వాత నలుగురు వ్యక్తులు నేరుగా భక్తులు విడిదిచేసిన గది వద్దకు చేరుకున్నారు. తాము పోలీసులమని చెప్పి ముగ్గురు లోనికివెళ్లగా, ఒకరు బయట గడియపెట్టారు. లోనికి వెళ్లిన ముగ్గురు వారిని బెదిరించి, చితకబాదారు. మహిళా భక్తురాలిపై అసభ్యంగా ప్రవర్తించారు. సదరు భక్తుడి నుంచి ఫోన్‌పే ద్వారా రూ.50వేలు, మహిళా భక్తురాలి ఖాతాకు ఫోన్‌పే చేయించి ఆమె ఏటీఎం కార్డు, ఇద్దరు సెల్‌ఫోన్లు, వారి వద్ద ఉన్న రూ.25వేలు బలవంతంగా తీసుకున్నారు. మొత్తం రూ.75వేలు బలవంతంగా లాక్కున్నారు. మహిళా ఏటీఎం కార్డు ద్వారా వేములవాడ పట్టణంలో మొత్తం ఐదు దఫాలుగా నగదు విత్‌డ్రా చేశారు. అయితే ఘటన జరుగుతున్నప్పుడు లాడ్జి నిర్వాహకులు రెండుసార్లు అక్కడికి వచ్చిన కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు ఈ నెల 14న ఠాణాలో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే రాజన్న సన్నిధికి వచ్చిన వారిపై దుండుగులు అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు పట్టణవాసులతోపాటు భక్తులను కూడా ఆందోళన గురిచేస్తున్నది.

## కొనుగోలు కేంద్రాల్లో కన్నీళ్లే..

- అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- సంచుల్లో నుంచి బయటకు వస్తున్న మొలక
- ఆందోళనలో రైతన్నలు



సారంగాపూర్: పెంబట్లలోని ధాన్యం కొనుగోలు సెంటర్‌లో తడిసిన ధాన్యం బస్తాల మధ్య నిలిచిన నీరు

కొనుగోళ్లలో ఆలస్యం, కొన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో నిర్లక్ష్యం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసుకున్న రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. అకాల వర్షాలతో తడిసి ముద్దవడంతో పాటు మొలక వస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనలో పడ్డారు. అరుగాలం శ్రమించి పడించిన పంటను అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు.



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో నేలవాలిన వరి

తిమ్మాపూర్/ కోనరావుపేట/ సారంగాపూర్/ మల్యాల/ కొడిమ్యాల, మే 17 : శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరిధాన్యం తడిసిముద్దయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వేంకట్రావుపేట, వట్టిమల్ల, సుద్దాల, మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో పోసిన వరిధాన్యం వానకు తడిసి మొలక వస్తున్నది. జగిత్యాల జిల్లా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. సెంటర్ల వద్ద రైతులు ధాన్యం తడవకుండా కుప్పలపై కవర్లు ఏర్పాటు చేసుకున్నారు. సారంగాపూర్ మండలంలోని పెంబట్లలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్లో ధాన్యం తడిసిపోయింది. సెంటర్‌లోకి భారీగా వరదనీరు చేరుకుంది. తూకం వేసిన ధాన్యం బస్తాలు వరదనీళ్లకు పూర్తిగా తడిసిపోయాయి. మల్యాల మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు అకాలవర్షానికి తడిసిపోయా మొలక వస్తున్నాయి. రామన్నపేటలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తూర్పార బట్టిన నాణ్యమైన ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లర్లు వెనుకడుగు వేయడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండగా, శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి చాలా ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. కొడిమ్యాల మండలంలోని నల్లగొండలోని కొనుగోలు కేంద్రంలో జోకిన వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయి. లారీలు రాకపోవడంతో పాటు హమాలీలు ధాన్యం జోకకపోవడంతో వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నేలవాలింది.



మల్యాల: రాంపూర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలను చూపుతున్న రైతులు



బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్

## దళారులను ప్రోత్సహిస్తున్నరు

ముస్తాబాద్, మే17: కాంగ్రెస్ సర్కారు వడ్ల కొనుగోళ్లను ఆలస్యం చేస్తూ.. దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నదని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు ప్రారంభించిన నాటి నుంచి జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిందో.. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యానికి డబ్బులు చెల్లిందో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కొనుగోళ్లు ప్రారంభించిన మొదట్లో గోదాములకు తరలించిన వడ్లకు వెంటనే డబ్బులు చెల్లించాలన్నారు. గోదాముల్లో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం భద్రపర్చారో చెప్పాలన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన వడ్లకు మూడునాలుగు రోజుల్లో డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్‌ఎస్ ఉద్యమిస్తుందని తెలిపారు. అకాల వర్షాలతో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలు బాధ్యతలను మహిళా సంఘాలకు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకొందని, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు ఎస్కే అన్వర్, ఎండీ జహంగీర్, నాయకులు కోడె శ్రీనివాస్, పల్లె సత్యం, కంచం నర్సింహులు, శేఖర్ చారి, మొలిగె మహేందర్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ లీడర్ భూకబ్జా చేసిండంటూ..

- ప్రజావాణిలో తప్పుడు ఫిర్యాదు
- రెవెన్యూ అధికారుల విచారణలో వెలుగులోకి ఘటన
- జిల్లాలో కలకలం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుడి ఫిర్యాదు

సిరిసిల్ల రూరల్, మే 17: బీఆర్‌ఎస్ లీడర్ ఎకరంన్నర భూమిని కబ్జా చేసిండంటూ.. ప్రజావాణిలో ఒకరు ఫిర్యాదు చేశారు. అయితే అధికారుల విచారణలో అసలు విషయం బయటపడింది. అసలు ఫిర్యాదుదారుడి ప్రమేయం లేకుండానే కావాలని ప్రజావాణిలో తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేలింది. రెవెన్యూ అధికారుల విచారణలో ఈ ఘటన వెలుగులోకి రాగా, జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకున్నది. ఇటీవల బీఆర్‌ఎస్ లీడర్లపై తప్పుడు కేసులు నమోదు అవుతుండడంతో ఇదే అదునుగా భావించిన దుండుగులు తప్పుడు ఫిర్యాదు చేయించినట్లు ప్రచారం జరుగుతున్నది. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరుకు చెందిన గొడుగు మల్లేశానికి గ్రామానికి చెందిన గొడుగు చిన్నఎల్లయ్య స్వయాన చిన్నాన్న. వీరిది వ్యవసాయ కుటుంబం. ఈ రెండు కుటుంబాలు ఎలాంటి వైరంలేదు. తన చినాన్న గొడుగు చిన్న ఎల్లయ్యకు పదెకరాల భూమి ఉన్నదని, సర్వే నంబర్ 408/15/3లో 20 గుంటలు, సర్వే నంబర్495లో ఎకరం భూమి కబ్జా చేశాడంటూ ఈ నెల12న ప్రజావాణిలో గొడుగు మల్లేశం పేరిట గుర్తు తెలియని వ్యక్తులు ఫిర్యాదు చేశారు. చిన్నఎల్లయ్య బీఆర్‌ఎస్ లీడర్ అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణలో భాగంగా రెవెన్యూ అధికారులు మల్లేశాన్ని సంప్రదించగా అసలు విషయం తెలిసింది. తాను ఎవరి మీద ఫిర్యాదు చేయలేదని, తన పేరును ఎవరో వాడుకొని, తన సంతకం ఫోర్జరీ చేశారంటూ మల్లేశం రెవెన్యూ అధికారులకు వివరించాడు. ఈ నెల 12న ఓ కేసు ఫేషీలో కోర్టులోనే ఉన్నానని వారికి చెప్పాడు. వెంటనే కలెక్టరేట్‌కు వెళ్లి తన పేరిట ఎవరో తప్పుడు ఫిర్యాదు చేశారని.. వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా ప్రజావాణిని దుర్వినియోగం చేసి కలెక్టర్, అధికారుల విలువైన సమయాన్ని వృథా చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. ఇంకా తనపేరిట ఏమైనా చేశారా, అక్రమాలకు పాల్పడ్డారో? విచారణ చేయాలని కోరారు. కాగా, 21న అధికారులు తనను కలెక్టరేట్‌కు రావాలని తెలిపినట్లు మల్లేశం తెలిపాడు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

## బీఆర్‌ఎస్‌ను విమర్శిస్తే అభివృద్ధి చేసినట్లు కాదు

బీఆర్‌ఎస్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, మే 17: ప్రభుత్వ విప్ హోదాలో అడ్లూరి లక్ష్మణ్ ప్రతిరోజూ అదేపనిగా బీఆర్ఎస్‌ను, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను విమర్శిస్తే అభివృద్ధి చేసినట్లు కాదని బీఆర్‌ఎస్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ డా ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సమయమంతా విమర్శలకు వెచ్చించకుండా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యల పరిష్కారం దిశగా ప్రయత్నించాలని, అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. శనివారం ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధి శూన్యమన్నారు. ప్రస్తుతం నడుస్తున్న కొద్దిపాటి పనులు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టినవేనన్నారు. 2018ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరుగలేదని అప్పుడే కోర్టు తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. అయిననూ అదే విషయాన్ని పదేపదే నొక్కి చెబుతూ ఈశ్వర్‌పై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. అలాగే గతంలో మీడియా సమావేశంలో తొలి సీఎం కేసీఆర్ అప్పుడు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్‌ను నెట్టివేశాడని ఆరోపించడమేకాకుండా, అలా నెట్టివేస్తే తానైతే రాజీనామా చేసేవాడినని అడ్లూరి చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. రాజీనామాల గురించి మాట్లాడే అర్హత అడ్లూరికి లేదన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులన్నీ బీఆర్‌ఎస్ హయాంలో దాదాపుగా పూర్తయ్యాయన్నారు. అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. లక్ష్మీనరసింహస్వామివారి సాక్షిగా ఆరు గ్యారెంటీల అమలు పత్రంపై చేసిన సంతకాలను మరిచారా అని ప్రశ్నించారు. ధర్మపురిలో అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడిందని, కేవలం కేంద్ర నిధులతో మాత్రమే పనులు జరుగుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి మంత్రి ఈశ్వర్ ఎనలేని అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ధర్మపురి సీహెచ్‌సీని వీవీపీగా అప్‌గ్రేడ్ చేయించడంతో పాటు, అద్భుతమైన మాతాశిశు దవాఖాన నిర్మించామన్నారు. కాంగ్రెస్ మహిళలకు రూ. 2,500 ఇస్తున్నారా.. 18ఏండ్లు నిండిన యువతులకు ఎన్ని స్కూటీలు ఇచ్చారు.. రుణమాఫీ రైతులందరికీ చేశారా? కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, మాజీ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మాజీ ఎంపీపీ చిట్టిబాబు, మాజీ కౌన్సిలర్లు అనంతుల విజయలక్ష్మి, అయ్యోరి వేణు, బండారి అశోక్, యూనుస్, నాయకులు శేఖర్, రాజేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.